242) భైరవి

ప॥ పరమాత్ముడు సర్వపరిపూర్ణుడు। సురలకు నరులకు చోటయియున్నాడు॥

చ॥ కన్నుల గంటానే కడు మాటలాడుతానే। తన్నుగానివానివలె దాగియున్నాడు।
అన్నియు వింటానే అట్టే వాసనగొంటానే। వన్నెలనూనెకుంచమువలె నున్నాడు॥

చ॥ తనువులుమోచియు తలపులు దెలిసియు। యెనసియునెనయక యిట్లున్నాడు।
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై। మొనసి పూసలదారమువలె నున్నాడు॥

చ॥ వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై। పూవులువాసనవలె బొంచియున్నాడు।
భావించనిరాకారమై పట్టితే సాకారమై। శ్రీవేంకటాద్రిమీద శ్రీపతై యున్నాడు॥